క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న కుమారస్వామి

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో పేదలకు రాబిన్‌హుడ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కాగజ్‌నగర్‌రూరల్ సీఐ కుమారస్వామి శనివారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరి గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్‌కుమార్, తాండూరు ఎంపీడీవో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఈశ్వరిబాయి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశానికి తరలిరావాలి’

బెజ్జూర్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండె విఠల్ నివాసంలో ఆదివారం నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ కాంగ్రెస్ నాయకుడు కొడ్ప విశ్వేశ్వర్ ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, పరిశీలకులు నరేశ్‌కుమార్‌తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

స్ప్రే కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న బాలాజీ

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో శనివారం సేంద్రియ ఉత్పత్తిదారుల రైతు సంఘం సభ్యులకు ఎస్టీ, ఎస్సీ ఉపప్రణాళిక కింద స్ప్రేకిట్లు, బ్యాటరీ డబ్బాలు పంపిణీ చేసినట్లు సేంద్రియ ఉత్పత్తి దారుల రైతు సంఘం మండలాధ్యక్షుడు కేంద్రె బాలాజీ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి ఆధ్వర్యంలో పంపిణీ చేసిన వాటిని రైతులు సద్వినియోగం చేయాలన్నారు. సంఘ సభ్యులు కుమురం న్యానేశ్వర్, గోపాల్, అంబరావు, రాము తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. నెల వారీ మరమ్మతులో భాగంగా గుండిరోడ్, టీఆర్‌నగర్, రాజంపేట మినహా పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పేకాట ఆడుతున్న వారితో పోలీసులు

కౌటాల: మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు శనివారం ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తలోడి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నరనే పక్కా సమాచారం మేరకు పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న పి.ప్రకాశ్, కె.శంకర్, ఏ. సంతోష్, పి.శంకర్, ఎం. రమేశ్, వి. సత్తయ్య, డి.అశోక్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6,700 నగదుతో పాటు 52 పేకాట కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

‘ఆలయ అభివృద్ధికి కృషి’

తలమడుగు: మండలంలోని బరంపూర్ సమీపంలో కొండపై స్వయంభూగా వెలిసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గేడం నగేశ్ అన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ తిరుపతిగా ఆధ్యాత్మిక కేంద్రంగా బరంపూర్ ఆలయం అభివృద్ధి చెందుతుందన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆలయ అభివృద్ధికి కృషి చేశామన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీలు గోక గణేశ్‌రెడ్డి, రాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, మౌనిష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ అమలెప్పుడో..?



మాస్టర్‌ప్లాన్ అమలు లేక వర్షాలకు మునిగిన వార్డు నం.9లోని కాలనీ(ఫైల్)

- సర్వేలకే పరిమితమవుతున్న ప్రభుత్వాలు
- 2018లో 150 అంశాలతో మొదటిసారి..
- ఈ ఏడాది జనవరిలో మరో సర్వే
- వచ్చే 30ఏళ్లకు సరిపడా సదుపాయాల కల్పనకు ప్రణాళిక
- వెంటనే అమలు చేయాలని పట్టణవాసుల డిమాండ్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ అమలుకు నోచుకోవడం లేదు. పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, వాహనాలతో రోడ్లు, మురుగు కాలువలు సరిపోని పరిస్థితి ఉంది. 1999 -2000లలో ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ ఆధారంగానే రోడ్లు, ఇతర నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రాబోయే 30 ఏళ్ల వరకు జనాభా ఎంత మేరకు పెరుగుతుందనే విషయాలను అంచనా వేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కలిగేలా మాస్టర్‌ప్లాన్ అమలు చేయాల్సి ఉంది.

70వేల మంది జనాభా..

కాగజ్‌నగర్ పట్టణంలో 30 వార్డులు ఉండగా సుమారు 70వేల మంది జనాభా ఉన్నారు. వాహనాలతో రోడ్లు, మురుగు కాలువలు సరిపోని పరిస్థితి నెలకొంది. 1999 -2000 సంవత్సరంలో ఏర్పాటు చేసిన మాస్టర్‌ప్లాన్ ఆధారంగానే రోడ్లు, ఇతర నిర్మాణాలు కొనసాగుతున్నాయి. 2018లో నూతనంగా మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఢిల్లీకి చెందిన ప్రైవేటు ఏజెన్సీతో మున్సిపాలిటీలో సర్వే చేపట్టారు. 150 అంశాలతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టారు. అనంతరం ప్రభుత్వం మారడంతో అమలుకు నోచుకోలేదు.

చేకూరనున్న ప్రయోజనాలు..

రాబోయే 30 ఏళ్లలో కాగజ్‌నగర్ పట్టణ జనాభా ఏ మేరకు పెరగనుంది. అందుకు అనుగుణంగా ఉండాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేలా నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. పట్టణంలో ఉన్న 30 వార్డులతో పాటు ప్రధాన రోడ్లు, గల్లీలు, మూలమలుపులు, సరిహద్దు ప్రాంతాలను గుర్తించి వచ్చే 30 ఏళ్లకు అనుగుణంగా ఉండే విధంగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్ల వెడల్పుతో పాటు రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు, నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తదితర పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే రెవెన్యూ, అటవీ, మున్సిపల్ మ్యాప్‌లతో పాటు సర్వే ఆఫ్ ఇండియా ఇచ్చిన మ్యాప్ ద్వారా ఎక్కడెక్కడ అక్రమణలు ఉన్నాయో గుర్తించడం సులభమవుతుంది.

2018లో సర్వే..

2018లో మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి పట్టణాన్ని అభివృద్ధి పర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఢిల్లీకి చెందిన ప్రైవేటు ఏజెన్సీతో సర్వే చేపట్టారు. 150 అంశాలతో సర్వే చేపట్టి రాబోయే 30 ఏళ్లలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఎలా ఉంటుందనే అంచనాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఇది అమలుకు నోచుకోలేదు. అమృత్ 2.0 పథకంలో ఈ ఏడాది జవరిలో సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మరో మారు సర్వే చేపట్టారు. డ్రోన్ సర్వే ద్వారా బేస్ మ్యాప్‌లను తయారు చేసేందుకు మూడు రోజుల పాటు 40 గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను ఏర్పాటు చేసింది. పట్టణంలో ఇండ్లు, పరిశ్రమలు, రిజర్వాయర్లు, సీసీ రోడ్లు, తారు రోడ్లు, వీధిదీపాలు, పార్కులు తదితరాలు పటం ద్వారా వివరించి వివరాలను డీటీసీపీకి అందజేశారు. సర్వే పూర్తయ్యి పది నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడంలేదు.



ప్రమాదకరంగా విక్రయాలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఇందిరామార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ చిరువ్యాపారులు తమ జీవనం కోసం ప్రమాదకరంగా రోడ్డు పక్కనే విక్రయాలు చేసుకుంటున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరామార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రతీరోజు ఈ మార్గం గుండా భారీ వాహనాలు మార్కెట్‌కు వస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రోడ్డు మీదనే విక్రయాలు చేస్తుండడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా



ప్రిన్సిపాల్‌తో కలిసి విజయసంకేతం చూపిస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల విద్యార్థులు సత్తాచాటారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ పోటీల్లో 14మంది విద్యార్థులు హాజరై 12పతకాలు సాధించారు. వీరిలో 8మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై రికార్డు సృష్టించారు. గురుకుల విద్యాలయంలో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల్లో కె.సంకేత్ (షాట్‌పుట్-స్వర్ణం, డిస్కస్ త్రో-రజతం), పి. లక్ష్మణ్ (100మీటర్లు-కాంస్యం), జి.సాహెబ్రో (100 మీటర్లు-కాంస్యం), టి.చరణ్(లాంగ్‌జంప్, హైజంప్-రజతం), టి.సిద్దార్థ(లాంగ్‌జంప్, హైజంప్-స్వర్ణం), బి.రాకేష్(110 మీటర్ల హార్డిల్స్-స్వర్ణం, ట్రిపుల్ జంప్-స్వర్ణం), యు.చరణ్ (400మీటర్ల హార్డిల్స్-రజతం), ఎస్.వికాస్ యాదవ్ (హైజంప్-రజతం) ఉన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే



ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద బండిసంజయ్‌కి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

జైపూర్: మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు ఏటా మధుకర్ కుటుంబాన్ని పరామర్శించడానికి శనివారం వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి జైపూర్ మండలం ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జైపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు ఆయనకు ఇందారం క్రాస్‌రోడ్డు వద్ద స్వాగతం పలుకగా చెన్నూర్ మీదుగా ఆయన నీల్వాయి చేరుకున్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు



మధుకర్ పాడె మోస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు, గోమాస శ్రీనివాస్

వేమనపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ అంత్యక్రియలు పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగాయి. చెన్నూర్ సివిల్ ఆసుపత్రి వద్ద శనివారం ఉదయం పోస్టుమార్టం పూర్తి కాగా బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సీఐలు బన్సీలాల్, దేవేందర్ రావు ఆధ్వర్యంలో మృతదేహాన్ని నీల్వాయికి తరలించారు. ఇంటి వద్ద అభిమానులు, పార్టీ కార్యకర్తల సందర్శనార్థం ఉంచగా, సుమారు 100మంది పోలీసులు పహారా కాశారు. పోలీస్ పహారా మధ్య మృతదేహాన్ని ఇంటి నుంచి ప్రధాన రహదారి గుండా నీల్వాయి అటవీ సమీప ప్రాంతానికి తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెళ్లిపోయే వరకు నీల్వాయి, కొత్తగూడెం కాలనీలో ఉత్కంఠ వాతావరణం మధ్య మధుకర్ అంతిమ యాత్ర కొనసాగింది.

పాడె మోసిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు

వేమనపల్లి: మధుకర్ కుటుంబాన్ని కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు పరామర్శించారు. ఏట మధుకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొని ఎమ్మెల్యే హరీశ్‌బాబు, గోమాస శ్రీనివాస్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ పాడె మోశారు. ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఎస్సైని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏమాజీ, దుర్గం అశోక్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, జయరామ్ రావు, వట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంట రక్షణకు దిష్టిబొమ్మ



చేనులో మూడు దిష్టిబొమ్మలు



దిష్టిబొమ్మకు తొడిగిన హెల్మెట్

కెరమెరి: పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓ వైపు పందులు, మరోవైపు కోతులు, ఇంకోవైపు పిట్టలతో వేగలేక రైతులు వినూత్న ఆలోచనలకు రూపు దిద్దారు. మండలంలోని రాంనగర్ గ్రామంలో ఓ రైతు పంటలను సంరక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన దిష్టి బొమ్మకు హెల్మెట్ తొడిగించారు. వీటిని చూసిన జంతువులు, పక్షులు మనిషి కాపాల కాస్తున్నాడన్న భయంతో అటువైపు వెళ్లడం లేదు. భీమన్‌గొంది గ్రామ సమీపంలోని ఓ పంట పొలంలో వరుసగా మూడు దిష్టి బొమ్మలు ఏర్పాటు చేశారు.

చెత్త నిర్వహణ గాలికి!

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- ఊరి బయట తగలబెడుతున్న వ్యర్థాలు
- ప్లాస్టిక్ నుంచి వచ్చే పొగతో వాతావరణ కాలుష్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వాగు తీరంలో పడేసిన చెత్త

వాంకిడి: పారిశుద్ధ్యంతో పాటు చెత్త వ్యర్థాల నుంచి సంపాదన రాబట్టాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణం చేపట్టింది. ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఆరుబయటే పడేస్తూ నిప్పు పెట్టడంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

రూ.3 లక్షలతో నిర్మాణం..

గత రాష్ట్ర ప్రభుత్వం చెత్త శుద్ధి కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఒక్కో షెడ్డు నిర్మాణానికి సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు చేసింది. ప్రతీ గ్రామ పంచాయతీలో షెడ్డు ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఏ ఒక్క చోట కూడా వినియోగంలో లేవు. మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలు ఉండగా చెత్త సేకరణకు ప్రతీ జీపీకి ఒక ట్రాక్టర్‌ను కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అడపాదడప ట్రాక్టర్ల నిర్వహణ, చెత్త సేకరణ జరుగుతున్నా తడి, పొడి చెత్త వేరు చేయడం మాత్రం జరగడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు అధికారుల నిర్లక్ష్యానికి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

ఆరుబయటే కుప్పలు..

ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో పారబోసిన తర్వాత తడి,పొడి చెత్తను వేరు చేసి షెడ్డులో వాటికి కేటాయించిన గదుల్లో వేయాలి. అలాగే ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు, గాజు సీసాలు, వంటివి వేరువేరుగా ఉంచాలి. వర్మీ కంపోస్టు తయారీ కోసం ప్రత్యేకించి ఒక బ్లాక్‌ను ఏర్పాటు చేశారు. అందులో మట్టి నింపి, వానపాములను వేయడం ద్వారా నాణ్యమైన ఎరువు తయారవుతుంది. తద్వారా జీపీల్లో ఏర్పాటు చేసే నర్సరీలలో ఎరువు కోసం ప్రత్యేకించి నిధులు కేటాయించకుండా తయారు చేసుకున్న ఎరువునే మొక్కల పెంపకానికి వాడొచ్చు అనేది లక్ష్యం. ఈ విధానంపై పంచాయతీ కార్యదర్శులకు, మల్టీపర్పస్ వర్కర్లకు శిక్షణ సైతం కల్పించారు. కానీ అధికారుల పట్టింపు కరువవడంతో ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను ఆరుబయటే పడేసి తగలబెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో గ్రామ వీధుల్లోనే చెత్త కుప్పలకు మంట పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో విపరీతమైన కాలుష్యం ఏర్పడుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..



వీధుల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులకు ఇదివరకే దీనిపై సూచనలు ఇచ్చాం. ఎక్కడైనా నిర్వహణ లోపిస్తే దృష్టి సారిస్తాం. వర్మీ కంపోస్టు ద్వారా ఎరువుల తయారీ, తడి, పొడి చెత్త వేరు చేయడం వంటివి తప్పనిసరిగా చేయాలని ఆదేశాలు ఉన్నాయి. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం. - ఖాజా అజీజుద్దీన్, ఎంపీడీవో

‘సమస్యలు పరిష్కరించాలి’

ఆదిలాబాద్‌టౌన్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని తీసుకువచ్చి కార్మికులకు రాని పనులను చేయిస్తుందని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, రవి, వెంకట్రావు, గంగన్న పాల్గొన్నారు.

‘సీజేఐపై దాడి అమానుషం’



మాట్లాడుతున్న వినేశ్

కెరమెరి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి కంబాల వినేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఈ నెల 13 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. గవాయ్ దళితుడు కావడంతో దాడి జరిగిందని, నిందితునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంబాల శ్రీనివాస్, పార్ల స్వామి, గోగర్ల రాజు ఉన్నారు.

కొనసాగుతున్న డైలీవేజ్ కార్మికుల సమ్మె



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో పని చేసే డైలీవేజ్ కార్మికులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె శనివారం 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. చేసిన పనికి వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. నెల రోజుల నుంచి సమ్మె చేస్తున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. వివిధ సంఘాల నాయకులు కృష్ణమాచారి, ప్రభాకర్, వసంత్ రావు, కోటయ్య, భరత్, వర్కర్లు శశికళ, దివ్య, లక్ష్మి, గంగుబాయి, ప్రమీల, తిరుపతి, దివ్య, మాన్కుబాయి పాల్గొన్నారు.